క్లుప్తంగా

నోట్ పుస్తకాల అందజేత



నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

అల్లూరు (కొత్తపట్నం): ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పాదర్తి పాఠశాల ప్రధానోపాధ్యయుడు కేత రాము నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో బుధవారం పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి ఎంఈవో 1, 2 తులసి, పద్మావతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల కోసం నిరంతరం ఉపాధ్యాయులు శ్రమించాలన్నారు. మానవ సేవే మాధవసేవ అని పేద విద్యార్థుల కోసం నిరంతర కష్టపడాలని ఉపాధ్యాయులకు హితవు పలికారు. పేద విద్యార్థుల కోసం తాను సహాయం చేస్తానని ముందుకొచ్చిన పాదర్తి హెచ్ఎం కేతా రాములకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు మాట్లాడుతూ విద్యార్థుల కోసం నిరంతరం నేను సహాయపడతానని హామీ ఇచ్చారు. ఇక్కడ ఎంతో మంది పాఠశాలలో చదివిన విద్యార్థులు ఎన్నో ఉన్నత పదవులు పొందారని గుర్తు చేశారు. అనంతరం 92 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. సహోపాధ్యాయులు హనుమంతరావు, మేరీ జయలత, సురేష్ , ఉపాధ్యాయలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రధాని ఫొటో పెట్టాలి

గిద్దలూరు రూరల్: ప్రభుత్వ కార్యాలయాల్లో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలని బీజేపీ గిద్దలూరు టౌన్ అధ్యక్షుడు అప్పిశెట్టి ఉదయ్‌శంకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీడీపీ, జనసేన అధినేతలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ల చిత్రపటాలు అన్ని కార్యాలయాల్లో ఏర్పాటు చేశారని, వాటితో పాటు మూడు పర్యాయాలు భారత ప్రధానిగా పనిచేసిన నరేంద్రమోదీ చిత్రపటాన్ని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఉన్నతాధికారులు ఈ విషయమై ఆలోచన చేసి నరేంద్రమోదీ చిత్రపటాన్ని ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

రిలయన్స్ షాపింగ్ మాల్ ప్రారంభం

గిద్దలూరు రూరల్: పట్టణంలోని రాంభూపాల్ రెడ్డి పెట్రోల్ బంకు సమీపంలోని రిలయన్స్ షాపింగ్ మాల్‌ను బుధవారం వైఎస్సార్ సీపీ నాయకుడు పిడతల ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిద్దలూరు ప్రాంతంలో ఇంత పెద్ద షాపింగ్ మాల్‌ను ఏర్పాటు చేయడం ఇక్కడి ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సరసమైన ధరలకు అనుగుణంగా నిత్యావసర వస్తువులు అందుబాటులోకి తీసుకొచ్చిన వ్యాపార దిగ్గజం రిలయన్స్ సంస్థ వారికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

కంభం: అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ సూచించారు. స్థానిక అర్బన్ కాలనీలో ఉన్న రెండు అంగన్ కేంద్రాలు, కందులాపురం కాలనీలో ఒక అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం ఆమె తనిఖీ చేశారు. కేంద్రాల్లోని స్టాక్ రిజిస్టర్, హాజరు పట్టికలు తనిఖీ చేసి నిల్వ ఉన్న వస్తువులను పరిశీలించారు. జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పిల్లలకు అందించే ఆహారం శుభ్రంగా తయారు చేసి అందించాలన్నారు. కేంద్రాల్లో సమస్యలు లేకుండా చూడాలని సీడీపీఓ ఫోన్‌లో కోరారు. చేగిరెడ్డి ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

కొనకనమిట్ల: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలని కొనకనమిట్ల ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ ఎస్పీ బాలయ్య పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పలువురు మహిళలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించి, ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. 11 మంది మహిళలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసినట్లు పేర్కొన్నారు. ఆపరేషన్లు చేయించుకున్న మహిళలకు ప్రభుత్వం అందించే పారితోషకం త్వరలో వారి బ్యాంక్ ఖాతాలో జమ అవుతుందని చెప్పారు.

దుకాణాల్లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీ

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని రెండు దుకాణాలను బుధవారం జిల్లా ఫుడ్‌ఇన్‌స్పెక్టర్ నరసింహులు తన సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. మెయిన్ బజారులో ఒక ఫ్యాన్సీ స్టోర్‌కు లైసెన్సు లేకపోవడంతో నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు. మరో ఫ్యాన్సీ షాపులో మూడు శాంపిల్స్ తీసినట్లు తెలిపారు. కాగా నెహ్రూబజారులోని ఒక మెస్‌పై వచ్చిన ఆరోపణలపై కూడా ఆయన విచారణ జరిపారు. షాపులకు లైసెన్సులు లేకపోయినా, అధిక ధరలకు విక్రయించినా తమ దృష్టికి తీసుకొస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు



ప్రత్యేక అలంకరణలో వెంకటేశ్వర స్వామి



సామూహిక విష్ణు సహస్రనామ పారాయణలో పాల్గొన్న భక్తులు

- సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం
- వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజలు

ఒంగోలు మెట్రో: ఆషాఢమాసంలోని ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని బుధవారం ఒంగోలు నగరంలోని వైష్ణవ ఆలయాల్లో ఘనంగా అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. స్థానిక బాపూజీ కాంప్లెక్స్ ఆవరణలోని వెంకటేశ్వర స్వామి దేవస్థానం, సమతా నగర్ వెంకటేశ్వర స్వామి దేవస్థానం, ఒంగోలు కొండపై వెలిసిన శ్రీగిరి వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు జరిగాయి. రంగారాయుడు చెరువు దగ్గర భూదేవి శ్రీదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఉదయం ఏడు గంటలకు స్వామి అమ్మవార్ల మూలవిరాట్‌కు అర్చక స్వాములు సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి వివిధ రకాల పూలతో పుష్పాలంకరణ గావించారు. అనంతరం అష్టోత్తర శతనామావళి జరిపించారు. సాయంకాల సమయంలో మహిళా భక్తుల సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఏకాదశి వ్రతాన్ని ఆచరించి స్వామి అమ్మవార్ల ఆశీస్సులు అందుకున్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయం అందిస్తున్న సూర్యశ్రీ ట్రస్టు సభ్యులు

ఒంగోలు అర్బన్: వృద్ధురాలి అంత్యక్రియలకు సూర్యశ్రీ ట్రస్టు సభ్యులు బుధవారం ఆర్థిక సహాయం అందించింది. బాలాజీ నగర్‌కు చెందిన పొట్లూరి చెంచమ్మ (80)కు తలలో గడ్డ ఏర్పడటంతో ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ మరణించింది. అంత్యక్రియలు చేసేందుకు డబ్బు లేక ఇబ్బంది పడుతున్న విషయం తెలిసిన ట్రస్టు సభ్యులు సర్దార్ బాష, దాతలు చితం నరేందర్, సామిల్ బొంత సహకారంతో రూ.12,200 కుటుంబ సభ్యులకు అందించారు.

జల్లిపల్లి సేవలు ప్రశంసనీయం



ఉప ఖజానాధికారి జల్లిపల్లి శ్రీనివాసరావును సన్మానిస్తున్న ఉద్యోగ సంఘాలు

ఒంగోలు టౌన్: ఖజానా శాఖలో అంకిత భావంతో పని చేస్తూ ఇతర శాఖల ఉద్యోగుల అభిమాన్ని సైతం చూరగొన్న జల్లిపల్లి శ్రీనివాసరావు సేవలు ప్రశంసనీయమని జిల్లా ఖజానాధికారి ఎ. జగన్నాథరావు కొనియాడారు. రిటైర్‌మెంట్ అయిన ఒంగోలు ఉప ఖజానాధికారి జలిపల్లి శ్రీనివాసరావును ఆంధ్ర ప్రదేశ్ ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యంయస్ ఫంక్షన్ హాలులో బుధవారం ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పీవీ నారాయణ అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా జగన్నాథరావు ప్రసంగిస్తూ సుదీర్ఘకాలం విశేషమైన సేవలను అందించి ఉద్యోగ బాధ్యతలను సక్రమంగా నిర్వహించారన్నారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాజ రాజ్ కుమార్, పీఏఓ రామకృష్ణ, డీటీఓ శివ కామేశ్వరి, ఏటీఓ పద్మావతి, పింఛన్‌దారులు సంఘం నాయకులు ఆల్‌ఫ్రెడ్, హనుమంతరావు, బాపయ్య చౌదరి, ఏపీటీఎస్‌ఏ సంఘ నాయకులు అబ్దుల్ ఖాదర్, జె.వెంకటేశ్వర్లు, కోటీ సుధీర, కొండలరావు, రాజ్యలక్ష్మి, డార్విన్, శ్రీధర్, శ్రీనాథ్ ప్రసంగించారు. అనంతరం జల్లిపల్లి దంపతులను శాలువాలతో సన్మానించారు.

ఘంటసాల విగ్రహం ఏర్పాటు చేయాలి



తెలుగు తల్లి విగ్రహం వద్ద మాట్లాడుతున్న వెంకటేశ్వర్ రెడ్డి

ఒంగోలు మెట్రో: తెలుగు పాట ద్వారా తెలుగు భాషకు ప్రాణం పోసిన ఘంటసాల 25 అడుగుల విగ్రహాన్ని నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు కోట వెంకటేశ్వర రెడ్డి , కోటి వెలుగుల తెలుగు అధ్యక్షుడు సంతవేలూరు కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఒంగోలు ఘంటసాల కళా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక రంగారాయుడు చెరువు వద్దగల కోటి వెలుగు తెలుగు తల్లి, శ్రీకృష్ణదేవరాయలు, అన్నమయ్య విగ్రహాల సెంటర్ వద్ద ప్రకాశం జిల్లా స్థాయి నవ్యాంధ్ర రాష్ట్ర సాంస్కృతిక చైతన్య ప్రచార కళా యాత్ర ప్రారంభ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా లలిత కళా అకాడమీ కోటి వెలుగు తెలుగు విగ్రహాల వ్యవస్థాపకుడు సంతవేలూరు కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు కోటవెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ అమరావతిలో 25 అడుగుల ఘంటసాల విగ్రహాన్ని ఏర్పాటుచేసి కళాక్షేత్రాన్ని నిర్మించాలని, ఎన్టీఆర్ ఘంటసాలకు భారతరత్న ఇవ్వాలని కోరారు. కృష్ణానదికి ఇరువైపులా తెలుగు జాతి మహనీయులు, స్వాతంత్ర్య సమరయోధులు, రచయితలు కళాకారులు శాస్త్రవేత్తల విగ్రహాలు ఏర్పాటు చేసి దేశ అంతర్జాతీయ స్థాయిలో పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఆనాటి రాష్ట్ర విభజన హామీలైన రాష్ట్రానికి ప్రత్యేక హోదా, పోలవరం పూర్తి చేయాలని, ఉత్తరాంధ్ర రాయలసీమలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని రాజధాని పునర్నిర్మాణం జరగాలని నూతన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కోట వెంకటేశ్వర రెడ్డి విజ్ఞప్తి చేశారు. నవ్యాంధ్ర రాష్ట్రంలో తెలుగు భాష వికసించాలని ఇంగ్లిషుకు తగిన ప్రాధాన్యత ఇస్తూ మాతృ భాష తెలుగును విడనాడవద్దని సూచించారు. ప్రకాశం జిల్లా స్థాయిలో త్వరలో అన్ని కళా సాంస్కృతిక సంస్థలు ఘంటసాల సంఘాలు తెలుగు కళా ప్రజా సంఘాలు తో కోఆర్డినేట్ కమిటీ నిర్మాణం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా ఘంటసాల కళా సంస్థ అధ్యక్షుడు యు. కోటేశ్వరరావు, తన్నీరు శివప్రసాద్, ఝాన్సీరాణి కళావేదిక అధ్యక్షుడు కోట సుభాష్ చంద్ర బోస్, కోట చిన్నారెడ్డి, జయవర్ధన్, మాంటిస్సోరీ ప్రిన్సిపాల్ ఎస్.కె నూరుద్దీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

సుబ్బారావు సేవలు మరువలేనివి



సుబ్బారావు దంపతులకు సన్మానిస్తున్న రెవెన్యూ అధికారులు

గిద్దలూరు రూరల్: రెవెన్యూ శాఖలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న సుబ్బారావు సేవలు మరువలేనివని వీఆర్‌ఓల సంఘ జిల్లా అధ్యక్షుడు వైపీ రంగయ్య యాదవ్ అన్నారు. డీటీ సుబ్బారావు పదవీ విరమణ సందర్భంగా రెవెన్యూ శాఖ ఉద్యోగులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో బుధవారం సుబ్బారావు దంపతులకు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిప్యూటీ తహసీల్దార్‌గా ఆయన సేవలు ప్రతి ఒక్కరూ గుర్తుంచుకుంటారన్నారు. అందరినీ కలుపుకుని పోయే మంచి మనిషిగా పేరుపొందారన్నారు. విధినిర్వహణలో అంకిత భావంతో పనిచేసిన అధికారిగా గుర్తింపు పొందారన్నారు. ఆయన అనుభవం రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న ప్రతి అధికారికి ఉపయోగపడేలా పనిచేశారన్నారు. జూనియర్ అసిస్టెంట్ సంధ్య, నారాయణరెడ్డి, వీఆర్‌ఓలు ఈశ్వర్‌రెడ్డి, ఫరిదా, లక్ష్మీ, అచ్చయ్య పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ముఖ్యం

కొనకనమిట్ల: కొత్త చట్టాల గురించి ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఎస్సై మాధవరావు సూచించారు. బుధవారం మండలంలోని మునగపాడు గ్రామంలో పర్యటించి శాంతి భద్రతలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కొత్త చట్టాలు, న్యాయపరమైన అంశాలను ప్రజలకు వివరించారు. గ్రామాల్లో ఎలాంటి వివాదాలకు తావులేకుండా సమన్వయం పాటించి ప్రశాంత వాతావరణంలో జీవించాలని సూచించారు. ఒకరికొకరు కలిసి మెలసి ఉండాలని చెప్పారు. అనంతరం దొనకొండ రోడ్డులో పలు వాహనాలను తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని వాహనదారులను హెచ్చరించారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

కొమరోలు: పేద విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రాంభూపాల్‌రెడ్డి సేవలు అభినందనీయమని ఎంఈఓ కావడి వెంకటేశ్వర్లు కొనియాడారు. మండలంలోని రాజుపాలెం కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయంలో గత విద్యాసంవత్సరంలో 10వ తరగతి, ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరాల్లో పరీక్ష రాసి ప్రతిభ కనబరచిన విద్యార్థులకు విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రాంభూపాల్‌రెడ్డి నగదు బహుమతులు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా రాంభూపాల్‌రెడ్డి విద్యార్థులకు బహుమతులు అందజేసి మాట్లాడుతూ పేద విద్యార్థుల కోసం తనవంతు సహాయాన్ని అందజేస్తానని, విద్యార్థులు చక్కగా చదువుకుని భావిభారత పౌరులుగా మెలగాలని కోరారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ రోజ్ సులోచన, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినులకు అభినందనలు



విజేతలతో ప్రధానోపాధ్యాయురాలు దేవసేన, సిబ్బంది

ఒంగోలు రూరల్: నంద్యాలలో ఈ నెల 27,28 వ తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జంప్ రోప్ పోటీల్లో విజేతలగా నిలచిన విద్యార్థినులను ముక్తినూతలపాడు ప్రధానోపాధ్యాయులు ఇ.దేవసేన అభినందించారు. ఆమె మాట్లాడుతూ తమ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించడం గర్వకారణంగా ఉందన్నారు. 7వ తరగతి 3 నిమిషాల ఇంజరిస్స్ పోటీల్లో టి.ప్రసన్న ద్వితీయ స్థానం, ఆర్. సనహా తృతీయ స్థానం, 30 సెకండ్స్ స్పీడ్ పోటీల్లో టి.స్రవంతి తృతీయ స్థానం, ఫ్రీస్టైల్ ఈవెంట్‌లో ఆర్.అవంతి తృతీయస్థానంలో నిలిచారన్నారు. పీడీ ప్రభాకర్, పీఈటీ రామాంజిబాబు, ఉపాధ్యాయులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉద్యోగ జీవితమే ఆత్మ సంతృప్తి

- ఏఆర్ దామోదర్



వెంకటేశ్వర్లు దంపతులను సన్మానిస్తున్న ఎస్పీ

ఒంగోలు టౌన్: ఉద్యోగం చేసినప్పటి సేవలే ప్రతి ఉద్యోగికి జీవితంలో ఆత్మ సంతృప్తి ఇస్తుందని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. ఒంగోలు పోలీసు ట్రైనింగ్ కళాశాలలో సుదీర్ఘకాలం సీఐగా విధులు నిర్వహించి బుధవారం రిటైర్డ్ అయిన అద్దంకి వెంకటేశ్వర్లు ఆత్మీయ వీడ్కోలు సభలో ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పదన్నారు. ప్రతి ఒక్కరూ ఉద్యోగానంతరం కూడా గుర్తుండి పోయేలా విధుల నిర్వహించి మంచిపేరు తెచ్చుకోవాలని సూచించారు. కానిస్టేబుల్‌గా పోలీసు శాఖలో చేరి అంచెలంచెలుగా ఎదిగి సీఐగా పదోన్నతి పొంది సమర్థవంతంగా విధులు నిర్వహించడం ద్వారా ఇండియన్ పోలీస్ మెడల్ సాధించిన అద్దంకి వెంకటేశ్వర్లు నేటి తరానికి ఆదర్శం అని కొనియాడారు. క్రమశిక్షణతో వృత్తి ధర్మాన్ని నిర్వర్తిస్తూనే కన్నబిడ్డలను ఉన్నతంగా తీర్చిదిద్ది కుటుంబ బాధ్యతలను కూడా సమర్థవంతంగా నెరవేర్చారన్నారు. అద్దంకి వెంకటేశ్వర్లు దంపతులను ఘనంగా సన్మానించారు. పీటీసీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డి.లక్ష్మణ్‌కుమార్, పీటీసీ డీఎస్పీలు జ్యోతి రాణి, సురేష్‌బాబు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదవాలి

- ఘనంగా రైజ్ కృష్ణసాయి గ్రూప్ మొదటి సంవత్సరం తరగతులు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న శిద్దా భరత్ తదితరులు



సాంస్కృతిక ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

ఒంగోలు: రైజ్ కృష్ణసాయి గ్రూప్ మొదటి సంవత్సరం తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం స్థానిక రైజ్ ఇంజినీరింగ్ కాలేజీలో అట్టహాసంగా ప్రారంభించారు. రైజ్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ కోశాధికారి శిద్దా భరత్ తదితరులు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా కమిటీ కార్యదర్శి శిద్దా హనుమంతరావు మాట్లాడుతూ విద్యార్థులు మొదటి నుంచి ప్రణాళికాబద్ధంగా సన్నద్ధం కావాలన్నారు. గ్రూపు కార్యనిర్వాహక చైర్మన్ ఇస్కాల చిన రంగమన్నార్ మాట్లాడుతూ విద్యార్థులకు మార్గదర్శకాన్నిచ్చే హోదా, సరైన పాత్ర పోషణ ఉన్నప్పుడే అర్థవంతం అవుతుందని తెలిపారు. వైస్ చైర్మన్ శిద్దా సూర్య ప్రకాశరావు మాట్లాడుతూ వసతుల కల్పనలో ముందున్న రైజ్ కృష్ణసాయి గ్రూప్, తల్లిదండ్రులు, విద్యార్థుల ప్రాధాన్యతలను గౌరవిస్తుందన్నారు. అన్ని ప్రమాణాలు పాటిస్తూ విద్యార్థుల ప్రగతికోసం కృషి చేస్తున్న రైజ్ కృష్ణ సాయి క్యాంప్‌లో విద్యార్థులు పోటీలో మేటిగా నిలవాలని, గొప్ప ప్లేస్‌మెంట్స్ సాధించాలని గ్రూప్ డైరెక్టర్ డాక్టర్ ఏవీ భాస్కరరావు పేర్కొన్నారు. విద్యార్థినుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రైజ్ రాగ విభాగం సేవలను మేనేజ్‌మెంట్ సభ్యురాలు, రాగ చీఫ్ అడ్వైజర్ శిద్దా ప్రవల్లిక సూచించారు. ఇంజినీరింగ్ విద్యలో విజయం సాధించేందుకు అవసరమైన సూచనలను ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ సుబ్రహ్మణ్యం విద్యార్థులకు వివరించారు. ప్రాసమణి మాటల ఒరవడి, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

వైభవంగా సామూహిక కోటి కుంకుమార్చన

పొదిలి: స్థానిక శ్రావణి ఎస్టేట్‌లోని శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో సామూహిక కోటి కుంకుమార్చన పూజలు వైభవంగా సాగుతున్నాయి. బుధవారం ఉభయదాతలను ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, పూజల అనంతరం సత్కరించారు. ఆలయ ప్రదాన అర్చకులు దీవి శ్రీకాంత్ భట్టర్, సలహాదారులు మురళీకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు యక్కలి శేషగిరిరావు, శ్రావణి వెంకటేశ్వర్లు, మేడా నరసింహారావు, రామాపురం కోటేశ్వరరావు, మల్లయ్య, పెరుమాళ్ళ భాస్కర్‌రావు, రవి, సాయి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సేవలతోనే గుర్తింపు లభిస్తుంది



సాంస్కృతిక ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

కొత్తపట్నం: ఉపాధ్యాయరంగంలో ఉన్నప్పుడు విద్యార్థులకు మనం అందించిన సేవలు గుర్తింపునిస్తాయని శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యుడు చాపల వంశీకృష్ణ అన్నారు. కొత్తపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యానిగా పనిచేస్తున్న వాసంతి ఉద్యోగ విరమణ సన్మానం బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి పాఠశాల ఇన్‌చార్జి ఎం.శ్రీదేవి అధ్యక్షత వహించారు. వంశీ కృష్ణ మాట్లాడుతూ పదవీ విరమణ ప్రతి ఒక్కరికి సహజమని అయితే ఉద్యోగం చేస్తున్న సమయంలో మనం చేసే సేవలే మనకు భవిష్యత్తునిస్తాయన్నారు. హెచ్ఎం శ్రీదేవి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో 41 సంవత్సరాలు పనిచేసి పదవీ విరమణ పొందడం చాలా అరుదన్నారు. ఆమె జీవిత కాలంలో సగం వంతు ఉపాధ్యాయ రంగంలోనే ఉండటం గర్వకారణమన్నారు. సన్మాన గ్రహీత వాసంతి మాట్లాడుతూ తాను విద్యార్థులు లేని పాఠశాలలో టీచర్‌గా చేరి ప్రస్తుతం జిల్లాలోనే ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో పదవీ విరమణ చేస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. మైనంపాడు, కొండపి సంతనూతలపాడు, ఉల్పి, కొత్తపట్నం వంటి పాఠశాలలో పనిచేశానని తెలిపారు. పాఠశాలకు గుర్తింపుగా జెరాక్స్ మిషన్ ఉచితంగా ఇవ్వడం జరిగిందన్నారు. అనంతరం వాసంతి, మల్లిఖార్జున్ దంపతులను ఘనంగా సత్కరించారు. డాక్టర్ చాలప వంశీకృష్ణ శాంతకుమారి దంపతలు గతంలో పాఠశాలలో పనిచేసిన విశ్రాంత ఉపాధ్యాయులు ప్రస్తున పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, బంధుమిత్రులు వారి దంపతులను ఘనంగా సన్మానించి కొనియాడారు. విద్యార్థిలచే పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల అసోసియేషన్ అధ్యక్షుడు చీమకుర్తి సత్యానారాయణ, పిన్ని వెంకటేశ్వర్లు, అల్లూరు, గమళ్ళపాలెం హెచ్ఎంలు సుబ్బారావు, శ్రీనివాసరావు, యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.శ్రీనివాసరావు, బీటీఏ రాష్ట్ర నాయకులు పర్రే వెంకట్రావు, సాయి కిషోర్, శరత్ చంద్ర, జిలాని బాష, హరిబాబు పాల్గొన్నారు.

టీచర్ లక్ష్మమ్మ సేవలు మరువలేనివి



లక్ష్మమ్మ దంపతులను సన్మానిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

బేస్తవారిపేట: ఉపాధ్యాయ వృత్తి పట్ల అంకిత భావంతో పనిచేసి విద్యార్థులు, తల్లిదండ్రుల మన్ననలను ఉపాధ్యాయురాలు కేవీ లక్ష్మమ్మ పొందారని హెచ్ఎం కర్నాటి తిరుపతిరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్లో సోషల్ స్కూల్ అసిస్టెంట్ కేవీ లక్ష్మమ్మ పదవీ విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. 36 ఏళ్ల ఉద్యోగ సమయంలో ఎందరో విద్యార్థినీ, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేశారని, వృత్తినే సర్వస్వంగా భావిస్తూ, ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చారని పలువురు హెచ్ఎంలు, ఉపాధ్యాయులు కొనియాడారు. స్కూల్ అసిస్టెంట్ కేవీ లక్ష్మమ్మ, రిటైర్డ్ ఉపాధ్యాయుడు నర్రా బసిరెడ్డి దంపతులను ఉపాధ్యాయులు, బంధువులు, కుటుంబ సభ్యులు, హెచ్ఎంలు శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. హైస్కూల్ హెచ్ఎంలు ఎంఎస్ శర్మ, అమూల్య, రామాంజనేయరెడ్డి, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాల పరిసరాలు శుభ్రం

సాక్షి ఎఫెక్ట్..

కంభం: మండలంలోని కందులాపురం పాఠశాలలో అపరిశుభ్రంగా ఉండటంపై బుధవారం సాక్షి దినపత్రికలో 'అపరిశుభ్రంగా కందులాపురం పాఠశాల' అన్న శీర్షికతో వచ్చిన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. బుధవారం పాఠశాల పరిసరాల్లో శానిటేషన్ పనులు చేపట్టారు. పాఠశాల ఎదురుగా ఉన్న మురుగు కాలువను శుభ్రం చేసి మంచినీటి కుళాయి చుట్టూ శుభ్రం చేశారు. పాఠశాల మైదానంలో ఉన్న చెట్ల కొమ్మలను, చెత్తాచెదారాన్ని ట్రాక్టర్ ద్వారా తొలగించారు.



ట్రాక్టర్‌తో చెత్త తొలగిస్తున్న సిబ్బంది

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

ఒంగోలు డివిజన్
9010224456 90103 57744
90102 02762
Office mail : sakshiongads@gmail.com